నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

5 | గురువారం 21 డిసెంబర్ 2023 | WARANGAL HANUMAKONDA





# కేఎంసీలో ఎంఈటీఆర్‌సీ

## నేడు ప్రాంతీయ వైద్యవిద్యా సాంకేతిక కేంద్రం ప్రారంభం

**అందుబాటులోకి రానున్న సేవలు.. మరింత మెరుగుపడనున్న వైద్యవిద్యా ప్రమాణాలు**

*వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 20 : కాకతీయ మెడికల్ కళాశాల చరిత్రలో మరో అరుదైన ఘనతకు చోటు దక్కింది. రాష్ట్రంలో మూడవ ఎంఈటీఆర్‌సీ(మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ రీజినల్ సెంటర్) కేఎంసీలో ఏర్పాటుకాగా నేషనల్ మెడికల్ కమిషన్ కేఎంసీలో గురువారం ప్రారంభించనున్నది. దీంతో నేటి నుంచి సేవలు అందుబాటులోకి వచ్చి వైద్య, విద్యా ప్రమాణాల తీరు మెరుగుపడనున్నది.*

మెడికల్ కౌన్సిల్ సభ్యులు బుధవారం కేఎంసీని సందర్శించి ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల బృందం నిర్వహించిన తనిఖీల్లో 2017లో అప్పటి కేఎంసీ వైద్యాధికారులు ఏర్పాటు చేసిన మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ పనితీరు, మౌలిక వసతులను పరిశీలించి ప్రాంతీయ వైద్యవిద్యా సాంకేతిక కేంద్రాన్ని ఏర్పాటుచేసేందుకు ఆమోదం తెలిపింది. నేటి నుంచి ఆరు నెలల పాటు ఈ విభాగం పనితీరును పరిశీలించి శాశ్వత అనుమతులు ఇస్తుందని కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్ తెలిపారు. విభాగానికి కేటాయించిన భవన వివరాలతోపాటు మూడేళ్ల కాలపరిమితితో నియమితులయ్యే కన్వీనర్, కో-కన్వీనర్‌ల సమాచారాన్ని కమిషన్‌కు అందజేసినట్లు తెలిపారు. వివరాలను పరిశీలించిన తదుపరి రీజనల్ సెంటర్ పరిధిలను ఏర్పాటుచేసి అందులోని కళాశాలలను ఈ కేంద్రానికి అనుసంధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతీయ కేంద్రం ద్వారా వైద్య విద్యాబోధన చేస్తున్న అధ్యాపకులకు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను, ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలు కలుగుతుందని చెప్పారు. తద్వారా విద్యాభ్యాసం సమయంలోనే వైద్యవిద్యార్థులు నూతన శాస్త్ర, సాంకేతికను అందిపుచ్చుకునే అవకాశం కలుగుతుందన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ పనితీరు మూలంగా ఈ కేంద్రం అందుబాటులోకి రానుందని ఆయన అన్నారు. గతంలో వైద్య బోధనా సిబ్బంది హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ తరగతుల్లో పాల్గొని విద్యార్థులకు నూతన సాంకేతికతను వివరించే వారని అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో భవిష్యత్తులో కేఎంసీ ఉన్నతస్థానంలో నిలిచేందుకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎంసీ బృంద సభ్యులు వర్ధన్నపేట ప్రభుత్వ వైద్యశాలను సందర్శించారు.

## మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవు



కాశీబుగ్గ, డిసెంబర్ 20 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ఇస్తున్నట్లు కార్యదర్శి బరుపాటి వెంకటేశ్ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న శనివారం వారాంతపు యార్డు బంద్, 24న ఆదివారం వారాంతపు సెలవు, 25న సోమవారం క్రిస్మస్ పండుగ సెలవు, 26న మంగళవారం బాక్సింగ్‌డే సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నట్లు తెలిపారు. 23న శనివారం జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ కొనుగోళ్లు యథావిధిగా ఉంటాయని పేర్కొన్నారు. సెలవులను దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావద్దని కోరారు. 27వ తేదీ బుధవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా జరుగుతాయని తెలిపారు.



# కరోనా.. వణుకు

## ఓవైపు చలి విజృంభణ.. మరోవైపు కొవిడ్ భయం

**వరంగల్, డిసెంబరు 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తూర్పు తీరం నుంచి బలమైన గాలుల కారణంగా మూడు, నాలుగు రోజుల నుంచి చలి విజృంభిస్తున్నది. వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే వేలాది మంది జలుబు, దగ్గుతో సతమతమవుతుండగా కరోనా హెచ్చరికలు మరింత వణుకు పుట్టిస్తున్నాయి. పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా హాస్పిటళ్లు జలుబు, జ్వరం బాధితులతో కిటకిటలాడుతున్నాయి. చలి పంజా విసురుతున్న క్రమంలో పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు పాటించాలని, వీలైనంత మేరకు ఉదయం, సాయంత్రం ఆరుబయట తిరుగొద్దని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.**

గాలులతో కూడిన చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు రోజులుగా బయటకు రావాలంటేనే జంకుతుకున్నారు. డిసెంబర్ మొదటి వారం నుంచే జలుబు, దగ్గు, జ్వర పీడితులు పెరిగిపోయారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. జాగ్రత్తలు పాటిస్తేనే కాస్త ఉపశమనం పొందవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు.

- ఇప్పటికే జలుబు, దగ్గుతో ప్రజల ఇబ్బందులు
- కిటకిటలాడుతున్న హాస్పిటళ్లు
- జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు
- మాస్కు ధరించకుంటే జరిమానా



### కరోనా భయం

జ్వరం, జలుబు, గొంతు సమస్యలు పెరుగుతున్న ఈ తరుణంలో కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్నదని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరికలు చేయడంతో జనంలో ఆందోళన నెలకొంది. కరోనాలో కొత్త వేరియంట్ (జేఎన్1) కారణంగా కేసులు పెరుగుతున్నాయని, మాస్కులు ధరించి అందరూ జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. లేకపోతే జరిమానా విధిస్తామని తాజాగా ఆదేశాలిచ్చింది. చలితో వచ్చిన జ్వరం, జబులుతో ఇబ్బంది పడుతున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. కరోనా తాజా వ్యాప్తి కారణంగా 10 ఏండ్ల లోపు వారు, 60 ఏండ్లు దాటిన వారు, గర్భిణులు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కు ధరించాలని, వీలైనన్ని ఎక్కువసార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరైతేనే ప్రయాణాలు చేయాలని పేర్కొన్నది. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది. ఇంటి లోపల వేడి వాతావరణం ఉండేలా చూసుకోవాలని, వీలైనంతగా పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరించాలని సూచించింది.

### పడిపోతున్న ఉష్ణోగ్రతలు


మూడు, నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 13.90 డిగ్రీలు, ములుగు జిల్లాలో 14.40, వరంగల్ జిల్లాలో 13.50, హనుమకొండలో 15, జనగామలో 15.10, మహబూబాబాద్‌లో 16.40 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణం కంటే అన్ని జిల్లాల్లోనూ సగటున ఒకట్రెండు డిగ్రీలు తక్కువ నమోదవుతున్నాయి. దీంతోపాటు సాయంత్రం నుంచి ఉదయం వరకు బలంగా వీస్తున్న గాలులతో భరించలేని చలివాతావరణం నెలకొంటున్నది. దీంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఈ రెండు, మూడు రోజుల్లోనే జ్వరం, జలుబు బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. తేమ కారణంగా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయి చాలా మందిలో శ్వాస సంబంధ సమస్యలు పెరుగుతున్నాయి. చాలా మందిని గొంతు నొప్పి పట్టిపీడిస్తున్నది.



### పాడిపంటలకూ తిప్పలూ

ప్రస్తుత చలి వాతావరణంతో పాడిపంటలకు సైతం ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎక్కువ విస్తీర్ణంలో సాగైన మిరప దెబ్బతింటున్నది. చలి గాలుల కారణంగా పూత, కాత నల్లగా మారుతున్నది. డిసెంబర్‌లో మామిడి పూతకు వచ్చేందుకు అదునుగా ఉంటుంది. కానీ ప్రస్తుత పరిస్థితి కారణంగా పూత రావడం లేదు. ఇప్పటికే వచ్చిన కొద్దిపాటి పూత సైతం నల్లగా మారిపోతున్నది. మరోవైపు పాడిపశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నది.

# 'సీఈఐఆర్'తో 987 సెల్‌ఫోన్లు రికవరీ..



- పోర్టల్ వచ్చినప్పటి నుంచి కొనుగొన్నవి..
- వరంగల్ కమిషనరేట్ ఐటీ కోర్ వెల్లడి

సుబేదారి, డిసెంబర్ 20 : సీఈఐఆర్.. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్. మీరు మీ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నా, ఎవరైనా దొంగిలించినా తిరిగి పొందే వీలు కల్పిస్తూ భారత ప్రభుత్వం గతేడాది ఏప్రిల్‌లో ఈ ట్రాకింగ్ సిస్టమ్‌ను రూపొందించింది. ఈ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది డిసెంబర్ 10వరకు ఎనిమిది నెలల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 978 సెల్‌ఫోన్లు రికవరీ అయ్యాయి. మొత్తం ఆరు వేలకు పైగా ఫోన్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదులు రాగా వినియోగంలో లేని 3,492 ఫోన్లను బ్లాక్ చేశారు. అలాగే 1,584 ఫోన్లను ట్రేస్ చేసి 984 అప్పగించగా, మిగతా 597 ఫోన్ల ఫిర్యాదులు దర్యాప్తు దశలో ఉన్నట్లు ఐటీ కోర్ విభాగం వెల్లడించింది.

### ఫోన్ పోతే ఇలా చేయండి..

ఫోన్ పోయినా/చోరీ అయినా వెంటనే మీసేవ సెంటర్‌కు వెళ్లి 'సీఈఐఆర్' పోర్టల్‌లో లేదా పోలీస్ ఐటీ కోర్ విభాగంలో ఫిర్యాదు చేయవచ్చు. ఆ సమయంలో ఫోన్ కొన్నట్టు ఉన్న రసీదు లేదా ఐఎంఈఐ నంబర్, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత మీసేవా రసీదును పోలీస్‌స్టేషన్‌లో అందస్తే ఫిర్యాదు వివరాల ఆధారంగా ఐటీ కోర్ విభాగం టెక్నాలజీ సాయంతో ఫోన్ ఎవరి వద్ద ట్రేస్ అవుట్ చేసి స్థానిక పోలీసులకు సమాచారం అందజేస్తుంది. చోరీకి గురైన ఫోన్ వినియోగంలో లేకపోతే బ్లాక్ చేస్తారు. ఈ విధంగా ఐటీ కోర్ సహకారంతో పోలీసులు ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసి చోరీ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తారు.

# గ్యారెంటీలు అమలు చేయలేకే ఆరోపణలు

## ప్రజలు ప్రశ్నిస్తారనే బీఆర్‌ఎస్ పాలనపై తప్పడు ప్రచారం

**తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే.. ఆటో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి**

**మల్టీ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి : మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 20 : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకే బీఆర్‌ఎస్ పాలనపై బురద చల్లుతోందని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. బుధవారం బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నేతల వ్యవహారం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. మంత్రి కొండా సురేఖ వరంగల్ సెంట్రల్ జైలును కూల్చారని ప్రస్తావించారని, కానీ అది శిథిలావస్థలో ఉన్నట్లు గతంలోనే గుర్తించారన్నారు. రూ. 1100 కోట్లతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ దవాఖానపై ఆమె హేళనగా మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంజీఎం దవాఖాన ఎలా ఉండేది? ఇప్పుడు ఎలా ఉంది. దీనిపై చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశారని, పల్లె, బస్తీ దవఖానలు ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. మహిలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు బస్సుల్లో ఉచిన ప్రయాణం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే గిరాకీ లేక రోడ్డున పడుతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, నాయకుడు పులి రజినీకాంత్ పాల్గొన్నారు.



క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ఐటీడీఏ పీవో అంకిత్

# రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటాలి

- ఐటీడీఏ పీవో అంకిత్..
- గిరిజన జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం

ఏటూరునాగారం, డిసెంబర్ 20 : రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటాలని ఐటీడీఏ పీవో అంకిత్ క్రీడాకారులను కోరారు. ఏటూరునాగారంలోని కుమ్రంభీం స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించే గిరిజన పాఠశాలల జోనల్ స్థాయి క్రీడలు బుధవారం ప్రారంభమయ్యాయి. క్రీడాజ్యోతిని వెలిగించిన అనంతరం పీవో మాట్లాడారు. గత క్రీడల్లో ఈ ప్రాంతం నుంచి అనేక మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, గురుకులం నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం హర్షనీయమన్నారు. క్రీడల నిర్వహణపై స్పోర్ట్స్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వచ్చే నెలలో భద్రాచలంలోని కిన్నెరసానిలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికయ్యేందుకు క్రీడాకారులు తమ నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కరీంనగర్ జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలలకు చెందిన 14,15 సంవత్సరాల బాల, బాలికలు 1,984 మంది పాల్గొంటున్నారన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, క్యారమ్, టెన్నికాయిట్, ఆర్చరీ, అథ్లెటిక్స్ ఈవెంట్స్ ఉంటాయని స్పోర్ట్స్ అధికారులు తెలిపారు. ప్రతి ఈవెంట్ నుంచి ఒక టీంను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ పోచం, మహబూబాబాద్ డీడీ మంకిడి ఎర్రయ్య, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీవో దేశీరాం నాయక్, ఏసీఎంవో రవీందర్, శ్రీరాములు, డిప్యూటీ డీఈవో సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్లు కిష్టు నాయక్, ఆదినారాయణ, మోహన్, శ్యామలత, స్కౌట్స్ ఆఫీసర్ గోపాల్, జీసీడీవో సుగుణ, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, పాల్గొన్నారు.

## నీటి సంపులో పడి చిన్నారి మృతి



లియాన్సీ(ఫైల్)

ఎల్కతుర్తి, డిసెంబర్ 20 : గోపాల్‌పూర్‌కు చెందిన పర్లపల్లి లియాన్సీ(1) బుధవారం నీటి సంపులో పడి మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిన్నారి తల్లిదండ్రులు మంజునాథ్-దీక్షిత గ్రామంలో కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. మంజునాథ్ ఉదయం పనులకు వెళ్లగా, దీక్షిత ఇంటి వద్దే ఉంది. ఈ క్రమంలో దీక్షితకు ఫిట్స్ రావడంతో స్పృహ కోల్పోయింది. ఈ క్రమంలో చిన్నారి ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడిపోయింది. స్పృహలోకి వచ్చిన దీక్షిత కూతురు కోసం వెతకగా, నీటి సంపులో పడి మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

## పద్మావతి, షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ల హాల్టింగ్



కేసముద్రం, డిసెంబర్ 20: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు, కాకినాడ నుంచి షిర్డీకి, విజయవాడ నుంచి షిర్డీకి వెళ్లే రైలుకు ప్రయోగాత్మకంగా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఇచ్చారు. ఈనెల 22 నుంచి పద్మావతి, 23 నుంచి షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆగుతాయి.

# మహాలక్ష్మి పథకంతో ఉపాధి కోల్పోయాం

**ఆటోడ్రైవర్ల పొట్టకొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**సర్కారు ఆదుకోవాలి.. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం..**

**పరకాలలో ఆటోడ్రైవర్ల భారీ ర్యాలీ.. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు**





ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

పరకాల, డిసెంబర్ 16: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో ఉపాధిని కోల్పోయామని, తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందంటూ ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి పాత ఏటీఎం సెంటర్ వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అనాలోచిత నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల పొట్ట కొట్టిందని, వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ స్వయం ఉపాధి పొందుతున్న తమను పట్టించుకోక పోవడం దారుణమన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోల్లో ఎవరూ ఎక్కడం లేదని, తాము రోడ్డున పడ్డామని, కుటుంబాలను పోషించుకోలేని దుస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, లేకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఫొటోతో హాజరు

**సర్కారు బడుల్లో విద్యార్థుల అటెండెన్స్ కోసం ఎఫ్ఆర్ఎస్ యాప్**



శాయంపేట : యాప్‌లో విద్యార్థి హాజరు నమోదు

శాయంపేట,డిసెంబర్ 20 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైసింగ్ సిస్టమ్) యాప్ తీసుకొచ్చారు. ఇందులో స్టూడెంట్ రిజిస్ట్రేషన్, అటెండెన్స్, డిటెయిల్డ్ రిపోర్ట్, సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీం వివరాలను రోజువారీగా నమోదు చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ముఖాన్ని ఫొటోతీసి యాప్‌లో నమోదు చేస్తున్నారు. పాఠశాల కోడ్, పాస్‌వర్డ్‌తో యాప్‌ను ఉపాధ్యాయుల ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. తరగతి, సెక్షన్ల వారీగా ఒక్కొక్కరికి నంబర్ ఇచ్చి యూడైస్ ఆధారంగా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. విద్యార్థిని ఫొటో తీయడం ద్వారా ఆటోమెటిక్‌గా డీఎస్ఈకి కనెక్ట్ అవుతుంది. ఎమ్మార్సీ, డీఈవో ఆఫీసు ద్వారా హాజరు సమాచారం చేరుతుంది.దీంతో పక్కాగా ఎందరు విద్యార్థులు హాజరయ్యారనేది తెలుస్తుంది. మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్, రాగిజావ పక్కాగా అందాల్సిన విద్యార్థులకే అందుతుంది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా వీక్లీ మెనూ అందుబాటులో ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్ తినే విద్యార్థుల హాజరును ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. మరుసటి రోజు ఇండెంట్ ఏంటనేది కూడా నమోదు చేస్తున్నారు. బ్రేక్‌ఫాస్ట్ రిపోర్ట్‌ను రోజూ యాప్‌లో నమోదు చేస్తున్నారు.